

బంగరు భవితకు బాటలు..
యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. - 8లో



పోలీస్ స్టేషన్ ముట్టడిపై కేసు నమోదుకు సన్నాహాలు
వేంపల్లె పోలీస్ స్టేషన్‌ను ముట్టడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. - 8లో

గరిష్టం/కనిష్టం 37.6 /27.4

వాతావరణం
జిల్లాలో మంగళవారం 27.4 – 37.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 48.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

మహా నివాళి

జిల్లాలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

కడప కార్పొరేషన్ : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదింటి సూరీడని..రైతు బాంధవుడని నేతలు కొనియాడారు. వైఎస్సార్ 76వ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో డాక్టర్ వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన సతీమణి వైఎస్ విజయమ్మ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, అంజద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

• కడపలోని హెడ్‌పోస్టాఫీసు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి మేయర్ సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పూలమాలలు వేసి నివాళి అర్పించా రు. జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి పాల్గొన్నారు.

• పులివెందులలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మార్కెట్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం, నూతన ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయం, భాకరాపురం వద్దనున్న వైఎస్సార్ ఆడిటోరియంలో అన్నదానం చేశారు.

• జమ్మలమడుగులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. క్యాంప్‌బెల్ హాస్పిటల్‌లో రోగు లకు పండ్లు పంపిణీ చేశారు. టీటీడీ కళ్యాణ మండపం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

• ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్య క్షుడు ఎం. సందీప్, ప్రొద్దుటూరు అధ్యక్షుడు గురునాథరెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మైదుకూరు రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బి. లక్ష్మిదేవి,వైస్ చైర్మెన్ పాతకోట బంగారుమునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కె. నాగేంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

• కమలాపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంబటూరు గ్రామంలో ప్రభుత్వ మాజీ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదర్శ రైతు పెరుగు శ్రీనివాసులు దంపతులను సత్కరించారు. పార్టీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాలెం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

• మైదుకూరు నియోజకవర్గంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఖాజీపేట మండలం భూమాయపల్లెకు చెందిన ఆదర్శ రైతు రామక్రిష్టారెడ్డి దంపతులకు పట్టు వస్త్రాలు అందజేశారు. చాపాడు ఎంపీపీ లక్ష్మయ్య, దువ్వూరు ఎంపీపీ జయచంద్రారెడ్డి, పట్టణ కన్వీనర్ లింగన్న, మున్సిపల్ వైస్ చైర్మెన్లు మాబు షరీఫ్, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

• బద్వేల్ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ, గుంతపల్లె రోడ్డు, బైపాస్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీజీపీ కాలనీ రోడ్డులో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో పండ్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు.



మిస్ యూ నాన్న..
వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ జగన్ భావోద్వేగం



వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

ముగిసిన జననేత పర్యటన



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ రెండు రోజుల జిల్లా పర్యటన ముగిసింది. చివరి రోజు వైఎస్సార్‌కు నివాళి అర్పించారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో కలిశారు. పలువురి అర్జీలు స్వీకరించారు.





ప్రజల కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ..



ఆనంద క్షణాలు.. అభిమానులతో జననేత సెల్ఫీ ...



వైఎస్ జగన్‌ను చూసిన క్షణం..కూలీల సంబరం



కడప ప్రధాన పోస్టాఫీసు కార్యాలయ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి నేతల నివాళి



కడపలో మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ



కడప నగరంలో వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న అభిమానులు



ప్రొద్దుటూరులో వైఎస్సార్ అభిమానుల రక్తదానం

న్యూస్‌రీల్

'అన్నదాతా సుఖీభవ' జాబితా సిద్ధం

• తప్పులు సరిదిద్దుకునేందుకు 13వ తేదీ వరకు గడువు
• జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

కడప అగ్రికల్చర్ : జిల్లాలో అన్నదాత సుఖీభవకు సంబంధించి అనర్హులుగా ఉన్న రైతులు రెవెన్యూ రికార్డుల్లో తప్పులు సరిదిద్దుకునేందుకు ఈ 13వ తేదీ వరకు గడువు ఉందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. రెవెన్యూ రికార్డులో తప్పులు సరిచేసుకుంటే అర్హులవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించిన జాబితా రైతు సేవా కేంద్రాల సిబ్బంది దగ్గర ఉందని చెప్పారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి జిల్లాలో 1,97,000 మంది రైతులు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఇందులో 1800 మంది రైతులు ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. అంతేకాక అనర్హులుగా ఉన్న 15000 మంది రైతుల ఖాతాలు తహశీల్దారు పరిధిలో ఉన్నాయని వారిటి సంబంధించిన జాబితా రైతు సేవాకేంద్రాల సిబ్బంది దగ్గర ఉందని ఆయన తెలిపారు. ఇందులో అర్హులుగా ఉన్న వారు రెవెన్యూ సిబ్బందిని కలిసి రెవెన్యూ రికార్డులో తప్పులు సరిదిద్దుకుంటే అటువంటి వారు అర్హులవుతారని తెలిపారు. ఈ పథకంలో ఇప్పటికే అనర్హుల రైతులు జాబితాలను రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉందని వివరించారు.

హనుమంత వాహనంపై సౌమ్యనాథస్వామి



నందలూరు : నందలూరులో శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన మంగళవారం రాత్రి హనుమంత వాహనంపై శ్రీ సౌమ్యనాథ స్వామి ఆశీనులై శ్రీరామచంద్రమూర్తి అవతారంలో భక్తులకు కనువిందు కలిగించారు. ఈ గ్రామోత్సవం నందలూరు, పేటగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా బస్టాండ్ కూడలి వరకు కొనసాగింది. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపు వెంట మహిళల కోలాటం భక్తులను అలరించింది. సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ పాల్గొన్నారు.

కలెక్టర్ గారూ... ఇదేం లెక్క!

• ఆరు మేజర్ రిజర్వాయర్లలో 90 శాతానికి పైగా నీటి నిల్వ ఎక్కడిది
• గండికోట సామర్థ్యం 26.85 టీఎంసీ కాగా 44 టీఎంసీలు ఎలా సాధ్యం?

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని ఆరు ప్రధాన రిజర్వాయర్లలో 90 శాతానికి పైగా నీరు నిల్వ ఉందంటూ కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు వివరించడం ఆశ్చర్య పరిచింది. సంభ్రమాశ్చర్యాలకు గురి చేసే మరో అంశం ఏమంటే గండికోట రిజర్వాయర్‌లో 37.99 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఆగస్టు చివరి నాటికి దాదాపు 44 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని చెప్పడం. గండికోట రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా మంగళవారం ఉదయం 7.10 గంటలకు 14.55 టీఎంసీ (54.19 శాతం)లు ఉన్నాయి. ఫ్లడ్ కుషన్ 12.3 టీఎంసీ, ఇన్‌ఫ్లో 0 కాగా, అవుట్‌ఫ్లో 370 క్యూసెక్కులు ఉన్నాయి. గండికోట పూర్తి సామర్థ్యమే 26.85 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 37.99 టీఎంసీల నీరు ఉండడం ఎలా సాధ్యం? అలాగే ఆగస్టు చివరి నాటికి 44 టీఎంసీలు ఎలా నిల్వ చేస్తారో అర్థం కాని విషయం. జిల్లాలోని ఏ రిజర్వాయర్‌లోనూ 90 శాతానికి పైగా నీరు నిల్వ లేదనే విషయాలు రాష్ట్ర ప్రభుత్వ ఏపీడబ్ల్యూఆర్ఐఎంఎస్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. వాస్తవాలు ఇలా ఉండగా ఆరు ప్రధాన రిజర్వాయర్‌లలో 90 శాతంకు పైగా నీటి నిల్వ ఉందంటూ చెప్పడం ఆశ్చర్యకరం. కలెక్టర్‌కు జలవనరులశాఖ అధికారులు ఇలాంటి సమాచారం ఇచ్చారో? లేక సమాచారశాఖ అధికారుల అంకెల నిర్లక్ష్యమో తెలియదు.

ప్రగతిచక్రం.. స్వర్ణోత్సవం

ఉభయ వైఎస్సార్ జిల్లాలో కడప తర్వాత ఏర్పాటైంది రాజంపేట ఆర్టీసీ డిపో. ఇది ఏర్పాటై 50ఏళ్లు పూర్తి కానుంది. కేవలం ఏడు బస్సులను రోడ్డుపైకి తీసుకొచ్చారు.గోల్డెన్ జూబ్లీ చేసుకోనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.



రాజంపేట ఆర్టీసీ డిపో

రాజంపేట: ఉభయ వైఎస్సార్ జిల్లాలో పార్లమెంటరీ కేంద్రమైన రాజంపేటలో ఆర్టీసీ ఆవిర్భావం ఐదు దశాబ్దాలకు చేరుకుంది. 1975 ఆగస్టు 15న డిపో ఏర్పాటు చేయాలని అప్పట్లో సంస్థ నిర్ణయించింది. కడప తర్వాత ఏర్పాటైన తొలి డిపో. ఈ క్రమంలో రాజంపేట–రాయచోటి రోడ్డులోని ఇప్పుడున్న ఎల్ఐసీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ప్రాంతంలో తాత్కాలికంగా కంచె ఏర్పాటుచేసి, అక్కడి నుంచి ఆర్టీసీ సేవలను తాత్కాలికంగా ప్రారంభించారు. కడపకు అప్పటికే ఏర్పాటైన డిపో నుంచి కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ కార్మికులను రప్పించారు. ఏడుబస్సులను తొలిసారిగా రొడ్కెక్కించారు.చరిత్ర ఘనంగా ఉన్నా అభివృద్ధి తిరోగమన దిశలో ఉంది. 50 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తారా అని కార్మికులు ఎదురు చూస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ హయాంలో..

మాజీ శాసనసభ్యురాలు కొండూరు ప్రభావతమ్మ ఆధ్వర్యంలో రాజంపేటలో ఆర్టీసీ ఏర్పాటుకు ప్రస్తుతం ఎర్రబల్లి ప్రాంతంలోని అరున్నర ఎకరాలకు పైగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ స్థలంలో బస్ స్టేషన్, ఆర్టీసీ కార్మికుల క్వార్టర్స్, డిపో గ్యారేజీల నిర్మాణం చేపట్టారు.ఇప్పుడు ఆర్టీసీ బస్టాండు ఇదే.ప్రస్తుతం ఈ స్థలాలకు కోట్లాది రూపాయల విలువ ఉంది. ఆర్టీసీ బస్టాండు,డిపో పట్టణానికే కేంద్రంగా మారింది.

• డిపో ఏర్పాటు తర్వాత అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. కడప జిల్లాలోని కడప, ప్రొద్దుటూరుతో సమానంగా బస్సు సర్వీసులను ఇక్కడి నుంచి నడిపారు. 2011–2012 వరకు 125 బస్సులు ఉండేవి. ఆర్టీసీ కార్మికులతో కళకళలాడింది. సబ్‌డివిజన్ పరిధిలో రైల్వేకోడూరు, రాజంపేట పరిసర ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు బస్సులను ఏర్పాటు చేశారు. పల్లెపల్లెకు బస్సులు నడిచేవి. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ వచ్చింది.

• మాజీ ముఖ్యమంత్రి జలగంవెంగళరావు, మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ హయాంలో చరిత్ర సృష్టించిన డిపో..ఇప్పుడైతే తిరోగమనదిశలో పయనిస్తుందనే విమర్శలున్నాయి. బస్సు సర్వీసులు తగ్గిపోయాయి. సగానికిపైగా పల్లెలకు బస్సులు తిరగడంలేదు. ప్రైవేట్ వాహనాల కారణమని ఆర్టీసీ వారు చెబుతున్నారు. ఆర్టీసీకి 40 బస్సులు ఉండగా, అద్దె బస్సులు 30 ఉన్నాయి. ఆర్టీసీ ఆదాయం కూడా ఘననీయంగా పడిపోతూవచ్చింది.

▶▶ పూర్వవైభవం వచ్చేనా...

రాజంపేట ఆర్టీసీ డిపో రోజురోజుకు తిరోగమన దిశలో ఉంది. కొత్తకొత్త సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నంతోపాటు పలు పుణ్యక్షేత్రాలకు డిపోనుంచి డైరెక్ట్ కనెక్టివిటీ సర్వీసులను ఫ్రీక్వెన్సీగా పెంచాలని ఆర్టీసీ వర్గాలవారు అంటున్నారు. నందలూరు ఆర్ఎస్ టు రాజంపేట ఆర్ఎస్ బసు సర్వీసుతోపాటు పల్లె సర్వీసులను పున రుద్ధరించాల్సిన అవసరం ఉంది. బ్యాటరీ బస్సులను ప్రవేశపెడితే రాజంపేట ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం వస్తుందని కార్మికులు చెబుతున్నారు. వందలాది రూట్‌లలో బస్సు సర్వీసులు ఉండగా, ఇప్పుడు 37 సర్వీసులకు వచ్చింది. ప్రస్తుతం 343 మంది కార్మికులు ఉన్నారు.

• రాజంపేట ఆర్టీసీ డిపో ఏర్పాటై 50 ఏళ్లు పూర్తి కావస్తోంది. 50 ఏళ్ల కిందట వేసి శిలాఫలకం కాలగర్భంలో కలిసిపోయింది. సిల్వర్‌జూబ్లీ చేసుకుంటున్న క్రమంలో ఆర్టీసీ అభివృద్ధిలో నూతన మార్పులు వస్తాయా? ఆ దిశగా ఆర్టీసీ యాజమాన్యం ఆలోచిస్తుందా అని కార్మికులు ఎదురు చూస్తున్నారు.

పూర్వవైభవం తీసుకురావాలి



కడప తర్వాత రాజంపేటలోనే ఆర్టీసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.డిపో ఏర్పాటై 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించాలి. ఆ బాధ్యత ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం తీసుకోవాలి. బస్సుస్టేషన్ ఆధునికీకరణతోపాటు కొత్త బస్సులు, అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలి. రాజంపేట డిపోకు పూర్వవైభవం కల్పించాలి.
–జీవీ నరసయ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎంప్లాయీస్ యూనియన్


ఏడు బస్సులతో డిపో ప్రారంభమైంది



కేవలం ఏడుబస్సులతో రాజంపేట ఆర్టీసీ డిపో ప్రారంభమైంది. సాతుపల్లెకు ఎదురుగా ఖాళీస్థలంలో తాత్కలికంగా బస్టాండు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి బస్సులను నడిపించారు. 1975లో డిపో ఏర్పాటులో పని చేసే అవకాశం తనకు కలగడం అదృష్టంగా భావిస్తున్నాను. –ఎం. బ్రహ్మయ్య, మాజీ కండక్టరు. రాజంపేట

పథకాలు ప్రజలకు పూర్తి స్థాయిలో అందాలి

డీఆర్సీ సమావేశంలో మంత్రి సవిత



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ అర్హులైన ప్రజలకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సమీక్షాకమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులతోపాటు ప్రజాప్రతినిధులంతా జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కలెక్టర్ డాక్టర్‌శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలన్నీ అమలు చేశామని పేర్కొన్నారు. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో అన్ని రకాల ఇరిగేషన్ కాల్వల పనులను, గ్రామీణ రోడ్లు, కాంపౌండ్ వాల్స్, స్మశానాలకు ప్రహరీలు వంటి నిర్మాణాలను ఉపాధి నిధులతో పూర్తి చేశామన్నారు. అన్ని మండలాల్లో మినీ గోకులం షెడ్లతోపాటు రైతుల డిమాండ్లను బట్టి చిన్నచిన్న జీవాల షెడ్లను కూడా చేపడుతున్నామన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా అధిక శాతం సబ్సిడీతో అన్ లిమిటెడ్ రుణ సాయం ఇస్తున్నామనే విషయాన్ని గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈనెల 10వ తేది అన్ని మండలాల్లోని పాఠశాలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న పేరెంట్స్, టీచర్స్ మీట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ గోకులం భవనాలు, ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు సూర్యఘర్ పథకాన్ని అనుసంధించాలని కోరారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ కడప కార్పొరేషన్ పరిధిలోని రైతులకు మినీ గురుకులాలు మంజూరు చేయాలన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ సీజన్ల వారీగా తెగుళ్ల నివారణ, ఎరువులవాడకంపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ సదరమ్ ఎంట్రీలు ఆన్‌లైన్‌లో మూడుసార్లు చేస్తే తర్వాత ఎంట్రీలు చేయడానికి సైట్‌లో అవకాశం ఉండదని, ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించాలని కోరారు. సబ్సిడీ గ్యాస్, రేషన్, రేషన్‌కార్డులలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు.

క్లుప్తంగా

చెట్టుపై నుంచి జారిపడిన వ్యక్తి మృతి

ముద్దనూరు : మండలంలోని ఓబుళాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు చెట్టుపైనుంచి జారిపడిన బాలిరెడ్డి(54) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ రమేష్ సమాచారం మేరకు ఈనెల 6వతేదీన బాలిరెడ్డి గ్రామంలో పీర్లపండుగ గుండం కాలడానికి మొద్దుల కోసం చెట్టు ఎక్కి కట్టెలు కొడుతున్నాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడడంతో అతనిపై చెట్టుకొమ్మ విరిగి పడింది. వెంటనే ప్రొద్దుటూరుకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి బాలిరెడ్డి మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గొర్రెలను ఎత్తుకెళ్లిన దుండగులు

వేముల : వేములకు చెందిన చెల్లుబోయిన రమణయ్య గొర్రెలను సోమవారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. రమణయ్య గొర్రెల పెంపకమే జీవనాధారం చేసుకుని జీవిస్తున్నాడు. సోమవారం గొర్రెలను మేతకు తీసుకెళ్లిన అనంతరం మండల కార్యాలయం వెనుక వైపు ఉన్న దొడ్డిలో తోలుకున్నాడు. గొర్రెల దొడ్డి వద్ద రమణయ్య తల్లి కాపలా ఉంటూ నిద్రపోయింది. ఇదే అదనుగా అర్ధరాత్రి సమయంలో దొంగలు దొడ్డిలోని 20 గొర్రెలను ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున చూసేసరికి గొర్రెలు లేకపోవడంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ సేవా సదన్‌లో పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్ల పాత్ర, డ్రెస్ కోడ్, ప్రవర్తన, నీతి ప్రమాణాలు, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, రాజ్యాంగం ప్రవేశిక ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు తదితర అంశాలను వివరించారు. అలాగే ప్యానల్ న్యాయవాదుల నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి జరిగిందని జడ్జి తెలిపారు. ప్యానల్ న్యాయవాదులు విధివిధానాలు, సివిల్ కేసులు, విధులు, సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

36 జీఓ అమలు కోసం అర్ధనగ్న ప్రదర్శన

రాయచోటి టౌన్ : జీఓ నంబర్ 36ను అమలు చేయాలని కోరుతూ రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఇంజినీరింగ్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు అక్బర్ మాట్లాడుతూ పని గంటలు పెంచి రూ.15 వేలు వేతనం ఇస్తున్నారని, పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చినట్లుగా రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని లేదా పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు కూడా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి శంకరయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు, మున్సిపల్ యూనియన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు బీవీ రమణ, నరసింహులు, ఇంజినీరింగ్ కార్మికులు దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం

- మత్తు పదార్థాల వల్ల జీవితం అంధకారం
- యువతపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సులో వక్తల పిలుపు



రిమ్స్‌లో యాంటీ డ్రగ్స్ అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న పోలీసులు, రిమ్స్ వైద్య అధికారులు



పొగాకు ఉత్పత్తులపై తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 'ఈగల్' టీం ఆధ్వర్యంలో కడప నగరంలోని రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల శాఖ ఏడీ కృష్ణ కిషోర్, రిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ భాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడారు. సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. అంతేగాక చిన్నచిన్న పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, కూలీల కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయన్నారు. పిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా ఉండాలన్నారు. అప్పుడే వారు ఉన్నతమైన స్థాయిలో ఉంటారన్నారు. మత్తు పదార్థాల సేవనం వల్ల మానసిక, శారీరక అనారోగ్యంతో పాటు ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ సమాజం నుండి దూరమవుతున్నారన్నారు. పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలకు, హత్యలకు సైతం పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా యువత కీలకమని, ఎవరూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని సూచించారు. మనమందరం సమష్టిగా మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే విధంగా ముందుకెళ్లాలన్నారు. కళాశాల సమీపంలో, చుట్టుపక్కల ప్రాంతాలలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్

జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల వద్ద 100 మీటర్ల దూరంలో సిగరెట్, పొగాకు సంబంధిత ఉత్పత్తుల విక్రయాన్ని నిషేధించారు. ఇందులో భాగంగా 'ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్' స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం పోలీసు అధికారులు తమ పరిధిలోని ఆయా పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలను సందర్శించి 100 మీటర్ల లోపు టీ షాపులు, పాన్ షాపులు, కిరాణా షాపులలో సిగరెట్లు, ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు అమ్మడం నిషేధమని షాప్ నిర్వాహకులకు తెలిపారు. విద్యా సంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయించే షాపుల యజమానులకు జరిమానాలు విధించారు.

బైకు చోరీ

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో సోమవారం రాత్రి ఇంటి దగ్గర పార్కింగ్ చేసిన టీవీఎస్ రైడర్ 125 సీసీ ఏపీ 40 సీఎల్ 6338 బైక్ చోరీకి గురైంది. బైకు యజామాని బింగి తనూజ్ కుమార్ శ్రేష్ఠి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి దగ్గర ప్రతిరోజు పార్కింగ్ చేసే చోటే సోమవారం సాయంత్రం 6 గంటలకు పార్కింగ్ చేసి ఇంటిలో నిద్రించానని తెలిపాడు. మంగళవారం ఉదయం 6 గంటలకు లేచి బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదన్నారు. దొంగను పట్టుకోవాలని కోరాడు. ఇప్పటికే రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

వ్యభిచార గృహంపై దాడి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలోని ఈడిగపేటలో వ్యభిచార గృహంపై పట్టణ పోలీసులు దాడి నిర్వహించారు. సీఐ ఎస్. లింగప్ప ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది వ్యభిచార గృహంపై దాడి నిర్వహించి ముగ్గురు మహిళలు, ముగ్గురు విటులను అరెస్టు చేశారన్నారు.

కూలిన బీవీఎస్ కాంప్లెక్స్ గోడ



బీవీఎస్ కాంప్లెక్స్‌ను కూల్చుతున్న బుల్డోజర్



మాట్లాడుతున్న బాధితుడు గాండ్ల నారాయణ స్వామి

ఫర్నీచర్ షాప్‌పై పడి రూ.30 లక్షల ఆస్తినష్టం

ప్రొద్దుటూరు : స్థానిక బీవీఎస్ థియేటర్ ముందున్న కాంప్లెక్స్‌గోడ కూలి శ్రీచక్ర ఫర్నీచర్ షాప్‌పై పడటంతో తీవ్ర నష్టం జరిగింది. గత పది రోజులుగా కాంప్లెక్స్‌ను బుల్డోజర్ సహాయంతో తొలగిస్తున్నారు. సోమవారం రాత్రి సమయంలో పనులు చేపడుతుండగా ఉన్నట్లుండి 50 అడుగుల పొడవు ఉన్న గోడ కూలి పక్కనే ఉన్న ఫర్నీచర్ షాప్‌పై పడింది. దీంతో ఫర్నీచర్ షాప్‌లోని బీరువాలు, ఫర్నీచర్ సామగ్రి దెబ్బతింది. పొరపాటున పగటి వేలలో ఈ ప్రమాదం జరిగి ఉంటే మెయిన్‌రోడ్డుపై ఉన్న మనుషులపై పడి తీవ్ర నష్టం కలిగేది.

ముందుగా హెచ్చరించినా ఫలితం లేదు..

గత పది రోజులుగా బీవీఎస్ కాంప్లెక్స్‌ను తొలగిస్తున్నారని శ్రీచక్ర ఫర్నీచర్ షాప్ యజమాని గాండ్ల నారాయణ స్వామి తెలిపారు. సరైన నిబంధనలను పాటించకపోవడంతో అప్పుడప్పుడు కాంప్లెక్స్‌కు సంబంధించిన రాళ్లు తమ దుకాణంపై పడేవన్నారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశానని, సోమవారం ఉదయం నేరుగా టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చానన్నారు. పోలీసులు స్వయంగా వచ్చి జాగ్రత్తలు పాటించాలని సూచించారన్నారు. చెప్పా పెట్టకుండా రాత్రివేళ పనులు ప్రారంభించారని, బీవీఎస్ కాంప్లెక్స్‌కు సంబంధించిన మొత్తం నిర్మాణమంతా తమ షాపువైపు పడటంతో తమకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. షాపులో సుమారు రూ.2కోట్ల మేర ఫర్నీచర్ ఉందని, దాదాపు రూ.30లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఆయన వివరించారు. తమకు బీవీఎస్ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి పరిశీలించారు. షాప్ యాజమాని నారాయణస్వామితో మాట్లాడారు.

గండిలో పలు టెండర్లు రద్దు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం నిర్వహించిన టెండర్లలో సరైన ధరలు రాక పోవడంతో కొన్నింటిని రద్దు చేసి మరి కొన్నింటిని ఆమోదించినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. ముఖ్యంగా పూలు విక్రయించుకునే హక్కు, టోల్‌గేట్ల వసూలు హక్కుకు సంబంధించి డిపాజిట్ చెల్లించిన వారు బహిరంగ వేలం పాటలో పోటీ పడక పోవడంతో నిలిపి వేశామని చెప్పారు. షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి కొన్ని గదులు ఎన్‌హెచ్ 440 రోడ్డు విస్తరణలో పోతున్నందున వాటిని వేలం పాట నిర్వహించకుండా నిలిపి వేశామన్నారు. ప్రత్యేక పూల అలంకరణకు సంబంధించి ఒక్క సీల్డ్ టెండరు మాత్రమే రావడంతో దాన్ని నిలిపి వేసినట్లు తెలిపారు. పందిళ్లు, బారికేడ్లు, విద్యుద్దీపాలంకరణ టెండర్లను ఆమోదించినట్లు పేర్కొన్నారు. నిలిపి వేసిన టెండర్లను ఈనెల 16వ తేదీన నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ప్రధాన అర్చకుడు కేసరి, మాజీ చైర్మన్‌లు వీరభాస్కరుడు, వెంకటస్వామి, చక్రాయపేట ఏపీజీబీ బ్యాంకు సిబ్బంది, ఆర్కే వ్యాలీ పోలీసులు పాల్గొన్నారు.

రాజంపేట ఎంపీపీ మృతి

రాజంపేట టౌన్ : రాజంపేట మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు వై.వెంకటనారాయణ (75) సోమవారం రాత్రి మృతి చెందారు. 2021వ సంవత్సరంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో వెంకటనారాయణ ఆకేపాడు ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. మండల ప్రజాపరిషత్ పదవి బీసీలకు కేటాయించడంతో వెంకటనారాయణకు ఎంపీపీ పదవి వరించింది. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటనారాయణ మృతి చెందిన విషయం తెలియగానే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకేపాటి రంగారెడ్డి, ఆకేపాటి మురళీరెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వెంకటనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

మదనపల్లె ఫైల్స్ కేసులో విచారణ

మదనపల్లె రూరల్ : మదనపల్లె ఫైల్స్ దగ్ధం కేసుకు సంబంధించి పూర్వ ఆర్డీఓ ఎం.ఎస్.మురళిని సీఐడీ అధికారులు మంగళవారం విచారించారు. తిరుపతి పట్టణం కే.ఆర్.నగర్‌లోని మురళీ నివాసానికి వెళ్లిన సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్, ఫైళ్ల దగ్ధం కేసుకు సంబంధించి, కొద్దిసేపు ఆయనను విచారించి, స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కురబలకోట : కురబలకోట మండలం ముదివేడు మార్గంలో శనివారం బైక్‌ను బొలెరో వాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన పెద్ద మండ్యం మండలం దట్టి నాయక్ తాండాకు చెందిన బాలాజీ నాయక్ మంగళవారం మృతి చెందాడు. తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సంఘటనలో ఆరుగురు గాయపడ్డారు.

సెంచరీలతో కదం తొక్కిన కడప బ్యాట్స్‌మన్లు



108 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ ప్రణీల్‌రెడ్డి



114 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ సుదర్శన్



85 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ రోహిత్ వర్మ



98 పరుగులు చేసిన పరుగులు చేసిన కర్నూలు బ్యాట్స్‌మన్ సాయి గణేష్



4 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ సాయి చరణ్

తొలి రోజు 461 పరుగులు చేసిన కడప జట్టు

కడప వైఎస్సార్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లో తొలి రోజు మంగళవారం వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప బ్యాటర్లు సెంచరీలతో కదం తొక్కారు. కడప, అనంతపురం జట్లు తలపడగా ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 88.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 461 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రణీల్ రెడ్డి తన బ్యాటింగ్‌తో విజృంభించి 138 బంతుల్లో 20 ఫోర్లతో 108 పరుగులు చేశాడు. టి.సుదర్శన్ చక్కటి లైనప్‌తో బ్యాటింగ్ ఆడి 109 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్సర్లతో 114 పరుగులు చేశాడు. రోహిత్ వర్మ 85 పరుగులు, ఆర్థిత్ రెడ్డి 70 పరుగులు చేయడంతో కడప జట్టు తొలి రోజు భారీ స్కోరు చేసింది. అనంతపురం జట్టులోని నవదీప్ 3 వికెట్లు, కేహెచ్ వీరారెడ్డి 3 వికెట్లు తీశారు.

కేఓఆర్‌ఎం క్రికెట్ మైదానంలో..

కేఓఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు –చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 77.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి గణేష్ 98 పరుగులు, భార్గవ్ 54 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 4 వికెట్లు, ఫణి 2 వికెట్లు, సిరాజ్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 11 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

చెత్తలో కాలిన మందులపై విచారణ



ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం చెత్తలో కాలిన మందుల వ్యవహారంపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత విచారణ చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మరకు కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుమన్‌తో కలసి ఆమె మంగళవారం కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలోని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటనకు దారితీసిన కారణాలు, పరిస్థితులపై ఆరా తీశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా హెచ్చరికలు చేశారు. ఈ సంఘటనపై విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పనిచేస్తున్న ఏఎన్‌ఎం, ఐదుగురు ఆశా వర్కర్లకు మెమోలు జారీ చేశారు. కాలం చెల్లిన మందుల నిర్వీర్యం కోసం బయోవేస్టేజీ నిర్వహణ పద్ధతులు ఉన్నాయని, వాటిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితోపాటు కొత్తపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కదులుతున్న రైలు నుంచి దూకి తల్లీకూతుళ్లకు గాయాలు



అంబులెన్సులో బాధితులను తరలిస్తున్న పోలీసులు

జమ్మలమడుగు : ఎక్కాల్సిన రైలుకు బదులు పొరబాటున మరో రైలు ఎక్కిన తల్లీకూతుళ్లు తీరా రైలు కదులుతున్న సమయంలో కిందకు దూకేయడంతో ఇద్దరూ గాయపడ్డారు. ఈ సంఘటన ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో జరిగింది. తల్లీకూతుళ్లయిన మహాలక్ష్మి, శ్రీదేవి మంగళవారం మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్లే రైలు కోసం ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో కూర్చున్నారు. అయితే ఇంతలో మరో రైలు రావడంతో అదే ధర్మవరం రైలు అనుకుని అందులో ఎక్కారు. తీరా కదులుతున్న సమయంలో ఇది ధర్మవరం రైలు కాదని మీరు వెళ్లాల్సిన రైలు మరొకటి అని తోటి ప్రయాణికులు చెప్పారు. అప్పటికే రైలు కదిలింది. దీంతో మహాలక్ష్మి, శ్రీదేవి వేగం పుంజుకుంటున్న రైలులో నుంచి ఒక్కసారిగా దూకేశారు. తల్లి మహాలక్ష్మికి స్వల్ప గాయాలు కాగా కుమార్తె శ్రీదేవి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే అక్కడ ఉన్న రైల్వే పోలీసులు ఏఎస్‌ఐ సలాం, సుబ్బరాయుడు పరుగున వచ్చి బాధితులకు ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరుకు తరలించారు.

అధికారుల తప్పిదం.. అందని తల్లికి వందనం

బ్రహ్మంగారిమఠం : అధికారుల తప్పిదంతో ఓ బాలిక తల్లికి వందనం పథకానికి అనర్హురాలిగా మిగిలిపోయింది. తల్లిదండ్రుల రేషన్ కార్డులో ధనికుల ఆస్తులు చేరడం వారికి శాపంగా పరిణమించింది. వివరాలు ఇలా..

బ్రహ్మంగారిమఠం సాగర్ రోడ్డులో కొత్తబస్వాపురం గ్రామంలో ఉన్న జంగంరాజుపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ భూమిరెడ్డి కృష్ణారెడ్డికి రేషన్‌కార్డు ఉంది. పెద్ద కుమార్తె భూమిరెడ్డి లక్ష్మీప్రియ ఆధార్ నంబర్ 451341547612కు తిరుపతి మండలం శ్రీనివాసపురం గ్రామ సచివాలయం కోడ్ నంబర్ 11190220 లో మరొక కుటుంబంలో అనుసంధానమైంది. ఇలా మండలంలో దాదాపు 750 మందికి ఇతరుల కుటుంబాలతో వారి ఆధార్ నంబర్ లింక్ అయినట్లు సచివాలయ సిబ్బంది తెలుపుతున్నారు. శ్రీనివాసపురం వాసులకు బంగళాలు, విలువైన భూములు ఉండడంతో వారికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు రావడం లేదు. వారి ఐడీలో చాలామంది ఆధార్ నంబర్లు కలసి పోవడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారు. తల్లికి వందనం డబ్బులు పడకపోవడంతో ఆరా తీస్తే ఇలాంటి సమస్యలు పుట్టలు పుట్టలుగా వెలుగు చూస్తున్నాయి. కృష్ణారెడ్డి రేషన్‌కార్డుకు ఆధార్ అనుసంధానం కావడంతో ప్రభుత్వ పథకాలు ఏ ఒక్కటీ వచ్చే అవకాశం లేదు. నరసన్నపల్లె గ్రామ సచివాలయం సిబ్బందిని ఈ విషయమై అడగగా ఈ తప్పిదం బి.మఠం మండలంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిదిద్ది న్యాయం చేస్తామని తెలిపారు.

సిగరెట్ తాగొద్దు అన్నందుకు యువకుడి ఆత్మహత్య



రెడ్డెప్ప (ఫైల్)

కురబలకోట : సిగరెట్ తాగొద్దు.. యుక్త వయస్సులో ఇదేమిపని అని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన మండలంలోని అంగళ్లులో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకులు, ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ వెల్లడించిన వివరాల మేరకు..అంగళ్లు టమాటా మండీల సమీపంలో గుడిసెలు వేసుకుని కొన్ని కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరిలో గోపాలమ్మకు కుమారుడు రెడ్డెప్ప (20) ఒక్కడే కుమారుడు. నాలుగు రోజుల క్రితం గుడిసెల వద్ద ఇతను సిగరెట్ తాగాడు. గమనించిన తల్లి గోపాలమ్మ మందలించింది. మనస్తాపం చెందిన అతను పురుగుల మందు తాగాడు. హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

ఒకే మాట..ఒక్క జీవితం.!

ఉన్న ఒక్క కుమారుడు అకాల మరణం చెందడంతో పుత్ర శోకంతో తల్లి గోపాలమ్మ తల్లడిల్లిపోతోంది. రేయ్ రెడ్డెప్ప నన్ను క్షమించరా..సిగరెట్ తాగొద్దనడం నా తప్పయ్యింది.. నీ మేలుకోసమే చెప్పా. నువ్వు ఇంతపని చేస్తావనుకోలేదురా..సిగరెట్ తాగొద్దు అనే ఒక్క మాట నీ జీవితాన్నే తీసుకుపోతుందని ఊహించలేకపోయారా..అంటూ ఆ తల్లి బాధతో రోదించడం కలచివేసింది.

దృష్టి పెట్టు.. సీటు కొట్టు

నేటి నుంచి జిల్లాలో క్రీడాపాఠశాల ప్రవేశాలకు ఎంపికలు

కడప వైఎస్సార్ సర్కిల్ : కడప క్రీడా పాఠశాల ప్రవేశాలకు వేళయింది. 2025–26వ సంవత్సరానికి సంబంధించి ఈనెల 9, 11వ తేదీల్లో స్థానిక మున్సిపల్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించేందుకు క్రీడా పాఠశాల అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ సామర్థ్య పరీక్షలకు జిల్లాలో 125 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 4వ తరగతిలో బాలురు –40, బాలికలు–14, 5వ తరగతిలో బాలురు –51 బాలికలు–20 మంది హాజరు కానున్నారు. వీరు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన పత్రాలతో పాటు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకుని హాజరుకావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. ప్రాథమిక వైద్య పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే జిల్లా స్థాయిలో ఎంపికలకు అర్హులన్నారు. 9వ తేదీన 4వ తరగతికి చెందిన బాలురు, బాలికలకు, 11వ తేదీన 5వ తరగతికి చెందిన బాలురు, బాలికలకు ఎంపికలు ఉంటాయని తెలిపారు.



కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల

పోలీస్ స్టేషన్ ముట్టడిపై కేసు నమోదుకు సన్నాహాలు



వేంపల్లె పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తున్న బాలిక కుటుంబ సభ్యులు, తదితరులు (ఫైల్)



బాలిక సుమియాకు నీరు తాపిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్ (ఫైల్)

వేంపల్లె : వేంపల్లె పోలీస్ స్టేషన్‌ను ముట్టడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. వేంపల్లె పంచాయతీ పరిధిలోని పక్కీరుపల్లెకు చెందిన సుమియా అనే బాలిక అదృశ్యం కావడంతో సోమవారం రాత్రి పక్కీరుపల్లె, బిడ్డాల మిట్ట, కాలేజీ రోడ్డులో ఉన్న పలువురు పోలీస్ స్టేషన్‌ను ముట్టడి చేశారు. దీంతో పోలీస్ స్టేషన్‌లోని కిటికీలకు ఉన్న అద్దాలను పగులగొట్టడంతోపాటు పోలీస్ స్టేషన్‌పై రాళ్లు, వాటర్ ప్యాకెట్లు రువ్వారు. అలాగే పోలీసు విధులకు ఆటంకం కలిగించడంతోపాటు పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బాలిక సుమియా ఆచూకీ తెలిసిందని ఇక వెళ్లాలని నిరసనకారులకు పోలీసులు తెలిపిన వినకుండా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు తమ సీసీ కెమెరాల్లో బంధించిన వీడియోలను చూసి నిరసనకారులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టేందుకు చర్యలు చేపట్టారు. నిరసన సమయంలో రాత్రి రోడ్లపై తిరిగే మోటార్ బైకులను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. మంగళవారం మోటార్ బైకుల కోసం వచ్చిన వారితో ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని, మోటార్ బైకు వద్ద ఫొటోలు తీసుకొని పంపించి వేశారు. సీసీ కెమెరాల్లో, పోలీసులు తీసిన వీడియోలో మోటార్‌బైకుదారులుంటే వారిపై కూడా కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో వందల మందిపై కేసు నమోదవుతుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. కేసు నమోదుపై పోలీసులు బిజీ బిజీగా ఉన్నారు. ఇప్పటికే పోలీసులు ఎవరెవరి మీద కేసులు నమోదు చేయాలనేది గుర్తించినట్లు తెలుస్తోంది.

బాలిక సుమియాకు కడప రిమ్స్‌లో చికిత్స..

సోమవారం రాత్రి పక్కీరుపల్లెకు చెందిన సుమియా ఆచూకీ తెలిసిన వెంటనే పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న బాలికకు మంచినీరు తాపించి కడప రిమ్స్‌కు పంపించారు. ఈ నేపథ్యంలో కడప రిమ్స్‌కు ప్రొద్దుటూరు డీఎస్పీ భావన వెళ్లి చికిత్స పొందుతున్న బాలిక సుమియాను విచారించారు. మంగళవారం ఆ బాలిక కోలుకుని ఆరోగ్యంగా ఉందని సీఐ నరసింహులు తెలిపారు. వివరాలను బాలిక చెబితే తప్ప నిందితులను శిక్షించలేమని చెప్పారు. ఇప్పటికే చింతలమడుగుపల్లె గ్రామానికి చెందిన మడక బాబు, వల్లెపు గంగాధర్, విజయ్ కుమార్ అనే అనుమానిత యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.